




బీజేపీ నేతల మధ్య కోల్డ్ వార్!

- జిల్లాలో కంట్రోల్ తప్పుతున్న కమలం పార్టీ
- క్యాంప్ ఆఫీస్ ఘటనతో మరోసారి బయటపడ్డ విభేదాలు
- భూ వివాదాల్లో తలదూర్చడంతో పలువురిపై చీటింగ్ కేసులు
- కొంత మంది నేతల తీరుతో విసుగెత్తి పోతున్న కార్యకర్తలు
- పార్టీని గాడిలో పెడితేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయావకాశాలు





ఆదిలాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కమలం పార్టీ కంట్రోల్ తప్పుతుందా? గడిచిన ఎన్నికల్లో అనుకూలమైన ఫలితాలు రావడంతో ఇంకా అదే భ్రమలో ఉన్నారా? గెలిచిన తర్వాత కార్యకర్తలను అసలు పట్టించుకోవడం లేదా? పార్టీలో కొంత మంది ఆగడాలు మితిమీరి పోతున్నాయా? ఆ వాదనే మళ్లీ గెలిపిస్తుందని అతీ ధీమాతో విర్రవీగుతున్నారా? అంటే ఔననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఉద్యమ పార్టీ దూకుడుకు అడ్డుకట్ట వేసి గెలిచిన కమలం పార్టీ.. అంతలోనే ప్రజావ్యతిరేకత, అనమ్మతిని కూడగట్టుకోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి. ఒకరిద్దరి సొంత నిర్ణయాలు పార్టీకి కొంత ఇబ్బందికరంగా మారుతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలో బలంగా కనిపిస్తున్న బీఆర్ఎస్, అధికార కాంగ్రెస్ పార్టీలను తట్టుకుని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవడం అంత సులువైన పనేమీ కాదన్న టాక్ వినిపిస్తుం ది. అసలు గెలిచిన నేతలతో పార్టీకి సంబంధమే లేకుండా పోయిందన్న విమర్శలు కూడా వస్తున్నాయి. ఆదిలాబాద్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి కొంత మెరుగ్గానే కనిపిస్తున్నా.. బోథ్‌లో మాత్రం పార్టీని పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్న వాదనలు ఉన్నాయి. అయితే పార్టీ అధిష్ఠానం సూచించిన లైన్‌లో కాకుండా కొంతమంది నేతలు సొంత ఎజెండాతో ముందుకెళ్లడమే ఇలాంటి పరిస్థితికి అసలు కారణమంటున్నారు. గత కొంత కాలంగా ముఖ్య నేతల మధ్య కోల్డ్‌వార్ కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న వార్తలు వస్తున్న సమయంలోనే పార్టీలో నెలకొంటున్న వివాదాలు, విభేదాలతో క్యాడర్ మరింత ఆందోళనకు గురవుతోంది. ఇకనైనా పార్టీని గాడిలో పెడితేనే పట్టు నిలుపుకునే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



పట్టించుకోవడం లేదన్న ఆవేదన

గత కొన్నేళ్లుగా పార్టీనే నమ్ముకుని పని చేస్తున్న వారిని అసలు పట్టించుకోవడం లేదంటూ కొంత మంది కార్యకర్తల్లో ఆవేదన వ్యక్తమవుతుంది. దీంతో గెలిచినా.. ప్రయోజనమే లేకుండా పోయిందన్న అసంతృప్తి కనిపిస్తుంది. ఎన్నో కష్ట నష్టాలను ఓర్చుకొని జిల్లాలో కమలం జెండా ఎగిరే విధంగా పని చేసినా.. పార్టీలో అసలైన కార్యకర్తలకు ప్రాధాన్యత లేకపోవడంతో లోలోన మండిపడుతున్నారు. ఇటీవల పలువురు ముఖ్య కార్యకర్తలపై కేసులు నమోదు కావడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అగ్రనేతలను నమ్ముకున్నా.. ఆదుకోలేక పోయారన్న ఆగ్రహమే క్యాంప్ ఆఫీస్ ఘటనకు కారణమైందన్న చర్చ సాగుతోంది. దీంతో పార్టీలో మరోసారి విభేదాలు భగ్గుమని బయటపడ్డాయి. ఇదంతా నేతలకు ముందే తెలిసినా కట్టడి చేయలేక పోయారన్న విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులతో పార్టీకి కొంత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందంటున్నారు.

అడ్డగోలు దందాలు

అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొంత మంది నేతలు అడ్డగోలు దందాలకు పాల్పడి పలు కేసుల్లో ఇరుకుంటున్నారు. ముఖ్యంగా భూ వివాదాలు, బెదిరింపులు, పలు వివాదాల్లో తలదూర్చడంతో ఇటీవల పలువురు ముఖ్యనేతలపై చీటింగ్ కేసులు నమోదయ్యాయి. అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన నేతలే.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడంతో పార్టీకి చెడ్డ పేరు వస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. నిరంతరంగా ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడాల్సిన వారే రాజకీయ, ఆర్థిక పలుకుబడిని అడ్డుపెట్టుకుని అక్రమ సంపాదనకు ఎగబడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. పలువురు పార్టీ ముఖ్యనేతలపై ఇటీవల కేసులు నమోదు కావడం జిల్లా రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఇలాంటి పరిస్థితులతో పార్టీ ఇమేజ్ మరింత దెబ్బతినే అవకాశం ఉందంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడే నాలుగు పైసలు వెనుకేసుకోవాలన్న భావనతో ఉన్న నేతలంతా.. ప్రస్తుతం పరేషాన్‌లో పడుతున్నారు. ఎందుకంటే జిల్లా పోలీసులు కొరడా ఝుళిపించడంతో అక్రమ దందాలకు అసలు అవకాశమే లేకుండా పోయింది. దీంతో కేసుల నుంచి తప్పించాలని పార్టీ అగ్రనేతలపై ఒత్తిళ్లు పెరుగుతున్నా.. ఏమీ చేయలేని పరిస్థితి కనిపిస్తుంది.

తరుచూ వివాదాలు

కొంత మంది నేతల తీరుతో పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుందని

(తరువాయి 2వ పేజీలో...)



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎవరి నిర్ణయంతో అభివృద్ధి పనులను కూల్చేస్తున్నారు!?

- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రధాన కూడళ్ల అభివృద్ధి పనులను ఎవరి నిర్ణయంతో కూల్చేస్తున్నారో? చెప్పాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. శనివారం ఈ విషయమై జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు వినతి పత్రాన్ని అందజేశారు. కూడళ్ల పనులను కూల్చివేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో అధికారుల సూచన మేరకే కూడళ్ల నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందని ఇప్పుడు అవి తప్పేలా అవుతున్నాయో? చెప్పాలన్నారు. తప్పుడు నిర్ణయాలు తీసుకున్న అధికారులపై చర్యలు తీసుకోకుండా.. ప్రజాధనాన్ని వృధా చేసే విధంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. దీనిపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అధికారుల చర్యలతో గత ప్రభుత్వంపై దుష్ప్రచారం జరిగే అవకాశం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు.. అభివృద్ధి పనులను కూల్చడం సరైంది కాదన్నారు. ఇందులో అజయ్, అశోక్ స్వామి, ప్రకాష్, దమ్మపాల్, కొండ గణేష్, మోబిన్, సాయి, ప్రణయ్, మోసిన్‌ఖాన్, అన్నెల వసంత్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పిడుగు పాటుకు గురై జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంచి ట్రీట్మెంట్ అందించి త్వరగా కొలుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఎమర్జెన్సీ వార్డులోని మరుగుదొడ్లను పరిశీలించి శుభ్రత పాటించక పోవడంతో అసహనం వ్యక్తం చేశారు. రోగులను పరిశీలించే సమయంలో వైద్యులు ఎవరెవరు ఉన్నారని ఆరా తీశారు. వైద్యులు అందుబాటులో లేక పోవడంతో వైద్యులు సమయానికి వస్తున్నారా లేదా అని సిబ్బందిని అడగగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో కేసిట్‌లను తెప్పించుకున్నారు. ఏ వైద్యులు ఎప్పుడు వస్తున్నారో? ఆరా తీసి విధులలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని డైరెక్టర్‌ను ఆదేశించారు. ఇందులో జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలి : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్ పట్ల ప్రజలు అప్రమత్తతతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా సైబర్ క్రైమ్ గురైన వెంటనే 1930 లేదా దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. సైబర్ క్రైమ్ బాధితులు డబ్బును పోగొట్టుకున్న గోల్డెన్ హవర్ అనగా ఒక గంట లోపు సంప్రదించినట్లయితే అందించే విధంగా కృషి చేయవచ్చన్నారు. బాధితులు మోసపోయిన గంట లోపు ఫిర్యాదు చేస్తే మరింత ప్రయోజనం లభిస్తుందని తెలిపారు. ప్రజలు ఎంత అప్రమత్తతో ఉంటే అంత జాగ్రత్తగా ఉంటూ తెలియని లింకులను అప్లికేషన్లను వాడకుండా ఉండడం మంచిదని సూచించారు.

'స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తులు'

ఉట్నూర్/ నేరడిగొండ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో నెలకొల్పిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ ఉపాధి శిక్షణ కేంద్రంలో స్వయం ఉపాధి రంగాలలో శిక్షణ కోసం ఆసక్తి ఉన్న యువకులు దరఖాస్తులు చేసుకోవాలని ఆర్సెట్ డైరెక్టర్ మహమ్మద్ గౌస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా మగ్గం వర్క్స్, బ్యూటీ పార్లర్, హౌజ్‌వైరింగ్, టూ విలర్ రిపేరింగ్, సెల్ ఫోన్ రిపేరింగ్, టూ వీలర్ మెకానిక్, ఫొటోగ్రఫీలలో శిక్షణ పొందడానికి ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువకులు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అంతేగాకుండా శిక్షణ కాలంలో ఉచిత శిక్షణతో పాటు టూల్స్ వీల్స్ అందించడం జరుగుతుంది అన్నారు. 18 నుంచి 45 ఏళ్ల లోపు వారు తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండి, నాలుగు ఫోటోలతో ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీలు ఈ నెల 25 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం 9949412159, 8985633226, 9441530494, 8096093085 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతతకు ధ్యానం ఎంతో ముఖ్యమని వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్‌పాండే అన్నారు. శ్రీరామచంద్ర మిషన్‌హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సమాఖ్య కార్యాలయంలో మూడు రోజుల ధ్యాన శిక్షణను ప్రారంభించారు. సిస్టర్ సునిత ధ్యానం గురించి తెలియజేస్తూ ఆసనాలు వేయించారు. వయోవృద్ధులు నిత్యం ధ్యానం చేస్తే దీర్ఘకాలిక వ్యాధులతో పాటు ఇతర సమస్యలకు దూరంగా ఉంటారని డాక్టర్ దేవిదాస్ పాండే అన్నారు. మూడు రోజుల పాటు అందించే శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ నిత్యం పాటించాలని సూచించారు. ఇందులో సమాఖ్య సభ్యులు పల్ల సత్యనారాయణ, నర్సింహులు, లక్ష్మారెడ్డి, గంగాధర్, శంకర్, రాంకులకర్ణి , రామారావు, తదితరులు పాల్గొన్నారు.

'మహాసభలను జయప్రదం చేయండి'

బోథ్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 21, 22న నిజామాబాద్‌లో జరగనున్న రాష్ట్ర ప్రథమ మహాసభలను బీడీ కార్మికులు కార్మిక సంఘాల వారు విజయవంతం చేయాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం మండలకేంద్రంలో విడుదల చేశారు.



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను సన్మానిస్తున్న నేరడిపల్లివాసులు

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలో గల పలు గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం బోథ్ మండలంలోని నేరడిపల్లి గ్రామస్తులు, తలమడుగు మండలంలోని లచంపూర్ గ్రామస్థులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి శాలువతో సన్మానించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోథ్ సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, పంద్రం శంకర్, నరేందర్, మాజీ సర్పంచ్ రాజేశ్వర్, రవికాంత్, తదితరులు ఉన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్తీని అరికట్టాలి : మాజీ ఎంపీ బాపురావు

ఆదిలాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయినిలో జరిగిన ఆలిండియా కన్సుమర్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయంబాపురావు ఆలిండియా కన్సుమర్ ప్రొటెక్షన్ జాతీయ అధ్యక్షుడు హరిశంకర్ శుక్లా, రాష్ట్ర అధ్యక్షుడు డా.బాలాజీతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి దేశంలోని రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి పలువురు అధ్యక్షులు, సభ్యులు హాజరు కావడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ దేశంలో ప్రతీ వస్తువు కల్తీ కావడంతో ప్రజలు అనారోగ్యం బారీన పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రత్యేక కమిటీలు వేసి లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చిన్న పిల్లలు తాగే పాల నుంచి బియ్యం, నూనె, తదితర ఆహార పదార్థాలు విలువైన టాబ్లెట్ కల్తీ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పశువులు లేని గ్రామాల నుంచి వేల లీటర్లలో పాల సరఫరా అవుతుందని పేర్కొన్నారు. అలాగే ఆన్‌లైన్ షాపింగ్‌తో ఎమ్మార్పీ రేటుకు సంబంధం లేకుండా అధిక ధరలకు వస్తువులను విక్రయించడం జరుగుతుందన్నారు. నకిలీ వస్తువులు, మందులపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.



మధ్యప్రదేశ్‌లో సమావేశంలో పాల్గొన్న మాజీ ఎంపీ

వర్షాకాలంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

- పిడుగు పాటు బాధితులను పరామర్శించిన ఎంపీ నగేష్

ఆదిలాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వర్షాకాల సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ గోడంనగేష్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే పాయల్‌శంకర్‌తో కలిసి బేల మండలంలో ఇటీవల పిడుగు పాటుకు గురైన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సహాయం అందేవిధంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీ పరంగా.. వ్యక్తిగతంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే సమయంలో రైతులు పంట పొలాల్లో ఉండకూడదని అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని ఎమ్మెల్యే పాయలశంకర్ సూచించారు. వర్షాకాలం ముగిసేంత వరకు రైతులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రజిత్, కరుణాకర్‌రెడ్డి, మురళిధర్, సందీప్, రాము, నవీన్, ముడేశ్కర్‌రాకేష్, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

- ఆపదలో అండగా ఉంటాం

ఆపదలో ఉన్న ప్రజలకు అండగా ఉంటామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజక వర్గంలోని బాధిత కుటుంబాలకు 42 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాలే పూర్తిగా అండగా ఉంటామని చెబుతున్నా.. కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు వైద్యం చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. పేద ప్రజలు పడుతున్న బాధలను స్వయంగా చూడడం జరుగుతుందన్నారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీలో ప్రతీ పేదవాడికి ఏ కష్టం వచ్చిన కార్పొరేట్ స్థాయి చికిత్సను అందించేందుకు రూ.10 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ విషయమై అసెంబ్లీలో పలుమార్లు మాట్లాడడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో పేదలకు అండగా ఉండే విధంగా పలు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రూపాయి ఖర్చు లేకుండా పేద ప్రజలను కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్య సేవలు అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ గొప్ప ఆలోచనతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించడం జరిగిందన్నారు. కాని వైద్యులు లేక హైదరాబాద్, నాగపూర్ లాంటి ప్రాంతాలకు వైద్యం కోసం వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇందులో వేణుగోపాల్, ఆదినాథ్, దయాకర్, జోగురవి, భీంసేన్‌రెడ్డి, కేశవ్,కరుణాకర్‌రెడ్డి, సత్యనందం, మహేందర్, పోతరాజు రమేష్, శ్రీనివాస్, తదితరులున్నారు.



బేలలో పిడుగు పాటు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

కూరగాయల సాగుపై రైతుల ఆసక్తి

- ఈ యేడు తాంసి మండలంలో 1500 ఎకరాలలో వివిధ రకాల కూరగాయల సాగు

తాంసి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పత్తి పంట తమను ఆదుకోలేక పోతోందన్న ఆవేదనతో మండలంలోని రైతులు ఆ పంటలకు గుడ్ బై చెబుతూ.. కూరగాయల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. తాంసి మండలంలో సుమారు 1500 ఎకరాలలో ఈ ఏడు కూరగాయల సాగు అవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయడం లేదని ప్రకటించడంతో సోయా, మినుము, పెసర, మొక్కజొన్న, జొన్న, పంటల సాగు విస్తీర్ణం పెరగనుంది. ముఖ్యంగా తాంసి మండలంలో పత్తి పంట సాగు విస్తీర్ణం తగ్గనుందని చెప్పవచ్చు. మండల వైశాల్యం 28 కిలోమీటర్లు మాత్రమే. ప్రస్తుతం 34 వేల హెక్టారాలో వివిధ పంటలు సాగు అవుతున్నాయి. ముఖ్యంగా ఈ సంవత్సరం పత్తి సాగు గణనీయంగా తగ్గనుందని అంటున్నారు. శుక్రవారం వరకు 98 శాతం మంది రైతులు వారి వారి పంట పొలాల్లో విత్తనాలు నాటారు. ఇందులో ఎక్కువగా పత్తి పంట నాటినప్పటికీ కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల సోయాబీన్ సాగుకి రైతులు మొగ్గు చూపుతున్నారని చెప్పవచ్చు.

- కూరగాయల సాగు కోసం చదును చేసిన భూమి





విత్తనాలు నాటి.. వరుణుడి కరుణ కోసం..

అన్నదాత ఎదురుచూపులు

- ముందే కురిసిన వర్షాలకు విత్తనాలు నాటిన రైతులు
- మున్ముందు వానలు కురవకపోతే నష్టపోయే ప్రమాదం

3 లో



కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

'తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాలుగో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి'

ఉట్నూర్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 29, 30వ తేదీలలో హనుమకొండలోని ఆర్ట్స్ సైన్స్ కాలేజి ఆడిటోరియం ప్రాంగణంలో జరుగనున్న తెలంగాణ ప్రజాఫ్రంట్ నాల్గవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు బానోత్ రామారావు, దిలీప్ చౌహాన్, నేతావత్ రాందాస్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్ ఆవరణలో రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం 40 ఏళ్ల పోరాటం చేసినా.. ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణ ఉద్యమంపై తీవ్ర నిర్బంధాన్ని విధించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం సైతం తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులపై నిర్బంధాన్ని అమలు చేసి అరెస్టులకు పూనుకుని జైలుపాలు చేసిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సైతం హక్కులు అడుగుతున్న ప్రజల మీద తీవ్ర నిర్బంధాన్ని అమలు చేస్తుందని ఆరోపించారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ శక్తుల ప్రయోజనాలు నెరవేరుస్తూ ప్రజల భూములను ఆక్రమించి నిరాశ్రయులను చేస్తోందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక హక్కులు అడుగుతున్న రైతులను, ఉద్యోగులను, నిరుద్యోగులను బెదిరింపులకు గురి చేస్తుందన్నారు. ఈ మహాసభలను విజయవంతం చేయడానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల వీరయ్య, సిడం జంగదేవ్, పోశెట్టి, లావుడియా పరశురాం, జాదవ్ రవినాయక్, పెందూరు మాణిక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి : ఆడె

బోథ్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నక్సల్స్ ఏరువేత పేరుతో చత్తీస్గడ్ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ డిమాండ్ చేశారు. మూడు దశాబ్దాల పాటు అజ్ఞాతంలో ఉండి దండకారణ్యంలో పేదల పక్షాన ఆడెల్లు పోరాటం జరిగిందన్నారు అయితే ఆయన కుటుంబ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యేవిధంగా కృషి చేస్తామన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కోటేశ్వర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.రాజు యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పోతన్న, మాజీ ఎంపీటీసీ మహేందర్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

'ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి'

నేరడిగొండ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులల్లో వైద్యులు సరైన వైద్యం అందించాలని లైఫ్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బీద ప్రజలకు సరైన వైద్యం అందడం లేదని, ప్రైవేట్ ఫార్మసీలలో తీసుకోండి అని డాక్టర్లు సతాయిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ డాక్టర్‌లకు ప్రభుత్వం అందించే జీతాలు సరిపోవడం లేదా? విమర్శించారు. ప్రైవేట్ దవాఖానాలలో ఎక్కువగా సమయం కేటాయిస్తూ దండుకుంటున్నారని, ప్రభుత్వ దవాఖానలో దొరకని మందులు.. ప్రైవేట్ దవాఖానా ఫార్మసీలో దొరకడం ఏంటి? అని జిల్లా అధికారులపై మండిపడ్డారు.

బ్యాంకుల వద్ద పోలీసుల నిఘా

● బోథ్‌లో కనిపించని దళారీలు



బోథ్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం వివిధ బ్యాంకుల వద్ద దళారీలు మకాం వేసి రైతులు తీసుకున్న పంట రుణాలను చెల్లించి రుణం మంజూరి అయిన తర్వాత ముందుగా మాట్లాడుకున్న ప్రకారం వడ్డీ తీసుకోవడం జరుగుతుంది. అయితే, ఈ అక్రమ వ్యాపారం అడ్డుకట్ట వేసేందుకు జిల్లా ఎస్పీ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో బ్యాంకుల వద్ద దళారీలు కనిపించకుండా పోతున్నారు.

● గంటల వ్యవధిలోని వేళలో ఆదాయం

గత ఏడాది రైతులు తీసుకున్న పంట రుణం ఈ ఏడాది చెల్లిస్తే బ్యాంకర్లు రుణం కొంత పెంచి ఇవ్వడం జరుగుతుంది. అయితే దీంతో రైతులకు తీసుకున్న రుణం పెండింగ్ బకాయి కింద రాకుండా లబ్ధి చేపడుతుంది. ఇదే అదనుగా ఒక భావించిన కొంతమంది దళారీలు రైతులతో రూ.వెయ్యికి రెండు రూపాయల పర్సంటేజీగా మాట్లాడుకుని వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. దీంతో అక్రమ వ్యాపారం విషయం జిల్లా ఎస్పీ దృష్టికి రావడంతో నియోజకవర్గంలోని పలు మండలాల్లో అక్రమ వ్యాపారం చేస్తున్న దళారీలను పట్టుకుని కేసులు నమోదు చేయడం జరిగింది. అయితే బోథ్ మండలంలో ఇంతవరకు ఇటువంటి వ్యాపారంలో కేసులు నమోదు కాకపోవడంతో పోలీసులు బ్యాంకుల వద్దనే వేసి ఉంచారు.

● మఫ్టీలో పోలీసులు

ఈ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలన్న దృక్పథంతో పోలీసులు బ్యాంకుల వద్ద గట్టి నిఘా వేశారు. దీంతో విషయం తెలుసుకున్న దళారీలు బ్యాంకుల వద్దకు వెళ్లకుండా అక్కడక్కడ నియమించుకొని ఈ వ్యాపారాన్ని చేపడుతున్నారు. అయితే బ్యాంకర్లు మాత్రం దళారీలను బ్యాంకుల్లోకి రావొద్దని ఇప్పటికే హెచ్చరించడం జరిగింది.

● రుచి మరిగిన దళారీలు

ఈ విధమైన వడ్డీ వ్యాపారం చేస్తున్న దళారీలు పోలీసుల నిఘాతో వారి కళ్లల్లో పడకుండా వ్యాపారం కొనసాగిస్తున్నారు. ప్రతీ యేటా ఈ సీజన్‌లో ఒక్క దళారీ లక్ష రూపాయల వరకు సంపాదిస్తుండటంతో ఆశ చావకుండా గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారాలను కొనసాగిస్తున్నారు అన్న విమర్శలు వస్తున్నాయి. అయితే దళారీలకు తిరిగి డబ్బు చెల్లించాలన్న దృక్పథంతో రైతులు బ్యాంకు రుణం చెల్లించిన రెండవ రోజునే రుణం ఇవ్వాలంటూ బ్యాంకర్ల వద్ద ఒత్తిడి తెస్తున్నారని ఓ బ్యాంకు మేనేజర్ వాపోయారు. ఏది ఏమైనా జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఈ అక్రమ వడ్డీ వ్యాపారంపై పోలీసుల దృష్టి సారించడంతో గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం జరుగుతుందని పలువురు అంటున్నారు.



రక్తదానం చేస్తున్న స్వచ్ఛంధ సంస్థల సభ్యులు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలి : కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రిమ్స్‌లోని ఆడిటోరియంలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన స్వచ్ఛంద సభ్యులు, సామాజిక వేత్తలకు సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదాన శిబిరాల వల్ల ప్రజల్లో రక్తదానం పై ఉన్న అపోహాలు,సందేహాలు తొలుగుతాయన్నారు. ఎన్‌జీఓలు ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. అత్యవసరంలో రక్తం కోసం అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇందులో డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ డా.జైసింగ్‌రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

● రక్తదానం చేసిన ఉపాధ్యాయులు

బోథ్: బోథ్ మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయులు రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆడిటోరియంలో శనివారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలను జిల్లా కలెక్టర్ ఎన్నిసార్లు రక్త దానం చేశారని అడిగి తెలుసుకున్నారు. 17వ సారి రక్తదానం చేయడం జరిగిందని ఉపాధ్యాయులు రావుల శంకర్, అప్పల శ్రీనివాస్ రెడ్డిలు పేర్కొన్నారు. ఇంత వయసులో రక్తదానం చేయడం అభినందనీయం అని పేర్కొంటూ వారికి సర్టిఫికెట్లను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు.

కంట్రోల్ తప్పుతున్న 'కమలం'!

(1వ పేజీ తరువాయి...)

పలువురు కార్యకర్తలు వాపోతున్నారు. తరుచు వివాదాల్లో తలదూర్చుతూ పార్టీ విధానం, సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నారంటూ ఆరోపిస్తున్నా రు. కీలకమైన పదవుల్లో కొనసాగుతున్న నేతలే పార్టీని ఇరుకున పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో పార్టీ అభ్యర్థులు గెలిచినా.. రాష్ట్రంలో పార్టీ అధికారంలో లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఉందని చెబుతున్నా.. వినిపించుకోవడం లేదంటున్నారు. అయినా కొంత మంది నేతలు మొండిగా వ్యవహరించడంతో పార్టీకి ఇబ్బందికరంగా మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. మొదటి నుంచి ప్రధాని నరేంద్రమోదీ ఈమేజ్‌నే నమ్ముకుంటున్న నేతలు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారానికి ఏమాత్రం కృషి చేయడం లేదన్న విమర్శలున్నాయి. పార్టీపై ఎంతో అభిమానం ఉన్నా.. కొంత మంది నేతల తీరుతో కార్యకర్తలు విసుగెత్తి పోతున్నట్లు వినిపిస్తుంది.



ఎంపీడీవో కార్యాలయం వద్ద పిచ్చిమొక్కలను తొలగిస్తున్న కార్మికులు

ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలలో పిచ్చిమొక్కల తొలగింపు

బోథ్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దోమల బెడద నివారణకు గ్రామపంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే ఎంపీడీవో కార్యాలయం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను పారిశుద్ధ కార్మికులు తొలగించారు. మొక్కలు పెరగడం వల్ల క్రిమికీటకాలు వృద్ధి చెందడంతో పాటు దోమలు పెరిగిపోతున్నాయి. గమనించిన ఈవో అంజయ్య మండల పరిషత్ కార్యాలయం పరిసరాలను శుభ్రం చేయించారు.

చైల్డ్‌ఫోర్న్ కేసులో ఇద్దరిపై కేసు : సీఐ

ఇచ్చోడ, జూన్14, (ఆంధ్రజ్యోతి) : చైల్డ్ ఫోర్న్ వీడియోలు చూసి, సోషల్ మీడియాలో షేర్ చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ సర్కిల్ సీఐ బండారి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చోడకు చెందిన ఠాగూర్ సూర్యసింగ్, నేరడిగోండ మండలం కుమారి గ్రామానికి చెందిన పోతగంటి రాకేష్‌లపై కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. పిల్లలపై జరిగే అత్యాచార వీడియోలను సోషల్ మీడియాలో అప్లోడ్ చేసిన కారణంగా వారిపై హైదరాబాద్ చైల్డ్ టిప్‌లైన్ వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

జొన్నల డబ్బులను విడుదల చేయాలి : సీపీఐ

బోథ్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గత నెల రోజుల క్రితం కొనుగోలు చేసిన జొన్న పంటకు సంబంధించిన డబ్బులు అను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ప్రతీ సంవత్సర ఇచ్చే రైతు భరోసా చెల్లించకపోగా.. జొన్న పంట కొనుగోలు చేసిన పంట తాలూకు డబ్బులను సైతం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. వ్యవసాయం చేస్తున్న రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నారని వారిని ఆదుకునేందుకు పంట పెట్టుబడుల కోసం తక్షణం నిధులు మంజూరు చేయాలన్నారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు బి.గోవర్ధన్, ఎల్. నరేష్, కార్తీక్, ముస్సిఫ్ పి.సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన బస్‌పాస్ ఛార్జీలను వెంటనే తగ్గించాలి

నిర్మల్ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పెంచిన బస్ పాస్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్ పత్రికా ప్రకటనలో తెలిపారు. బస్ పాస్ ఛార్జీలను 20 శాతం పెంచడం సరికాదని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బస్‌పాస్ ఛార్జీలను తగ్గించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జగన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ➤

లేబర్ కోడ్‌ల రద్దు కోసం సార్వత్రిక సమ్మె బుక్‌లెట్ విడుదల



బుక్‌లెట్ విడుదల చేస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : కార్మికచట్టాల పరిరక్షణకై నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుకై జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె బుక్ లెట్ విడుదల చేసినట్లు సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు తెలిపారు. శనివారం టీఎన్జీవో భవనంలో జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక అస్తిత్వానికి అత్యంత ప్రమాదకరమని కార్మిక చట్టాల పరిరక్షణకై జూలై 9న కేంద్ర కార్మికసంఘాలు, ఉద్యోగ సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్‌లు పిలుపు మేరకు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సురేష్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ అధ్యక్షులు పి. గంగామణి, జిల్లా ఉపాధ్యక్షులు జి.కిషన్, జిల్లా కమిటీ సభ్యులు శైలజ, చంద్రకళ, ఆశావర్కర్ జిల్లా అధ్యక్షులు బి.సుజాత, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు నంద, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గుజిరిగల్లి శిశుమందిర్ పాఠశాలకు దాత విరాళం



భైంసాలో కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న ప్రజోత్ కుమార్

భైంసా,జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలోని గుజిరిగల్లి శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రజోత్ కుమార్ అనే పూర్వ విద్యార్థి రూ. 50వేలు విరాళం అందజేశారు. శనివారం పాఠశాలలో అభివృద్ధి కమిటి సభ్యుల సమక్షంలో ఆర్థిక సాయం అందజేశారు. తాను చదువుకున్న పాఠశాలకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తాననీ ప్రజోత్ కుమార్ తెలిపారు. శిశు మందిరాలు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలు అన్నారు. విద్యార్థులకు నైతిక విలువలతో పాటు సంస్కారం, దేశభక్తి నాణ్యమైన విద్య అందించడం అభినందనీయమన్నారు. ఇందులో అభివృద్ధి కమిటి సభ్యులు పెండెప్ కాశీనాథ్, తోట రాము, దత్తురాం పటేల్, శివ బచ్చువార్, రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులకు నవ వధువు బలి

● పెళ్లి అయిన మూడు నెలలకే ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య ● ఖానాపూర్ మండలం మస్తాన్ ఎల్లాపూర్‌లో విషాదం ● భర్త, అత్త సహా ఆరుగురిపై కేసు నమోదు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై



ఆసుపత్రి ఎదుట రోదిస్తున్న మృతురాలి బంధువులు



శైలజ-రాజేష్‌ల పెళ్లి ఫొటో (ఫైల్)

ఖానాపూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తుపై ఎన్నో కలలు కంటూ వివాహం అనే బంధంతో పుట్టింటికి దూరమైన ఓ నవ వధువు చివరికి అత్తింటి వేధింపులు తాళలేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన హృదయ విదారకమైన ఘటన ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మస్తా ఎల్లాపూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన కథనం ప్రకారం... పాత ఎల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మస్తాన్ ఎల్లాపూర్ గ్రామానికి చెందిన దండగుల శైలజ(20) అనే యువతికి మూడు నెలల క్రితం పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన అల్లెపు రాజేష్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. కాగా పెళ్లి అయిన కొద్ది రోజుల నుండి అదనపు కట్నం కోసం శైలజకు అత్తింటి వారి వేధింపులు పెరిగిపోయాయి. ఈ వేధింపులు తాళలేక శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంట్లో ఉరేసుకొని శైలజ ఆత్మహత్యకు పాల్పడింది. వరకట్న వేధింపులతో శైలజ ఆత్మహత్యకు పాల్పడడంతో అందుకు కారణమైన ఆమె భర్త అల్లెపు రాజేశ్వర్, అత్త గంగు, భర్త నానమ్మ చిన్నక్క, సహా అత్తింటి కుటుంబ సభ్యులు అల్లెపు రాజేశ్వర, నర్సయ్య, రాజలింగులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. ఘటన స్థలాన్ని ఏఎస్పీ రాజేష్ మీనా, ఖానాపూర్ ఇన్‌చార్జి సీఐ గోవర్ధన్ రెడ్డిలు పరిశీలించారు. శైలజ మృతదేహానికి ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న ఏఎస్పీ రాజేష్ మీనా

జోరుగా సోయా సాగు

● తేమ ఉన్నప్పుడే విత్తాలని వ్యవసాయ అధికారి సూచన



తురాటి గ్రామంలో ట్రాక్టర్‌తో సోయా పంట చేస్తున్న రైతుల దృశ్యం

నర్సాపూర్(జి), జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలంలోని తురాటి గ్రామంలో రైతులు ట్రాక్టర్ల సహాయంతో సోయా పంటను ముమ్మరంగా సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల వ్యవసాయ అధికారి రామ్ చందర్ నాయక్ రైతులకు కీలక సూచనలు చేశారు. భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడు సోయా విత్తనాలను విత్తుకోవాలని ఆయన స్పష్టం చేశారు. నైరుతి రుతుపవనాల రాకతో ఇటీవల తురాటి గ్రామంలో కురిసిన వర్షాలకు నేలలో తేమ శాతం గణనీయంగా పెరిగింది. ఇది సోయా సాగుకు అనుకూలమైన వాతావరణం కావడంతో రైతులు ఉత్సాహంగా విత్తనాలు విత్తుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. చాలా మంది రైతులు తమ పొలాలను దున్ని, విత్తనాలను నాటడానికి ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. దీనివల్ల సమయం ఆదా అవడమే కాకుండా, తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో సాగుచే యవచ్చని రైతులు అభిప్రాయపడుతున్నారు.

రైతులు పాటించాల్సిన ముఖ్యమైన పద్ధతులు

● మండల వ్యవసాయ అధికారి రామ్‌చందర్ నాయక్



విత్తన శుద్ధి.. విత్తనాలను నాటడానికి ముందు శుద్ధి చేసుకోవడం వల్ల తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకోవచ్చు. వ్యవసాయ శాఖ అధికారు లు రైతులకు అవసరమైన అన్ని సలహాలు, సూచనలు అందించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని ఆయన హామీ ఇచ్చారు. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించ వచ్చని తెలిపారు.

డా. బి.వెంకట్‌కు రాష్ట్ర విశిష్ట సేవా కీర్తి పురస్కారం

ముథోల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌కు చెందిన ప్రముఖ పద్య కవి, వ్యాఖ్యాత, సంస్కృతోపన్యాసకులు డా. బి. వెంకట్ రాష్ట్ర విశిష్ట సేవా కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సంస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ, కళామారుతి వేదికలో జరిగిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు 2025 ముగింపు సభల్లో సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ శర్మ, ప్రధాన కార్యదర్శి సుప్రియ గుప్తా, ప్రముఖ కవులు చౌదూరి కళాపీఠం అధ్యక్షులు చౌదూరి నరసింహ రావు చేతుల మీదుగా పురస్కారమును అందుకున్నారు. సాహిత్య, సామాజిక, సాంస్కృతిక కళ ఆధ్యాత్మిక విశిష్ట సేవలకు గుర్తింపుగా పురస్కారమును స్వీకరించారు. ఆపరేషన్ సిందూర్ అనే అంశంపై వచన కవితను, పద్యాలను గానం చేశారు. ప్రముఖ కవులు ఎం. సత్యవీణ, డా. వేము వందనం, మండపాక అరుణకుమారి, సుజాతారాణి, తదితరులు వెంకట్‌ను అభినందించారు.

నర్సాపూర్ (జి) వద్ద బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు





నర్సాపూర్(జి), జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెట్రోల్ పంపు సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో డొంగుర్‌గాం గ్రామానికి చెందిన నర్సయ్య (34) తీవ్రంగా గాయపడ్డారు. పంజాబ్ పాసింగ్ ఉన్న ఓ కొత్త బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. నిర్మల్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్న నర్సయ్యను పెట్రోల్ పంపు వద్ద భైంసా నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో నర్సయ్య కుడి కాలు విరిగింది. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంజాబ్ పాసింగ్ ఉన్న కొత్త బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరుణుడి కరుణ కోసం రైతన్న ఎదురు చూపులు

బోథ్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం రాకముందే మండే ఎండల్లో మే నెల చివరి వారంలో జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచి కొట్టాయి. దీంతో రైతులు తమ తమ చేలలో వ్యవసాయపు పనులను పోటీపడి పూర్తి చేసుకుని విత్తనాలను జూన్ మూడవ తేదీ నుంచి విత్తనాలను రైతులు నాటుతూ వస్తున్నారు. అయితే విత్తనాలను నాటిన రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు కురవకపోతే రైతులు ఆర్థికంగా నష్టపోయే ఆస్కారం ఉందన్న ఆందోళన వ్యక్తపరుస్తున్నారు.

● వేల ఎకరాలలో విత్తనాలు నాటి

మండలంలో రైతులు వేలాది ఎకరాలలో పత్తి, సోయాబీన్ విత్తనాలను నాటడం జరిగింది. అయితే నాలుగు రోజుల క్రితం భూమిలో నాటిన విత్త నాలు వర్షాలు కురువక మొలకెత్తడం లేదు. దీంతో రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. భూమిలో నాటిన విత్తనం తేమతో ఉబ్బి పోతున్నదని రైతులు పేర్కొంటున్నారు. చిరుజల్లులు కురిసిన విత్తనాలు మొలకెత్తుతాయని లేకుంటే విత్తనాలు చెడిపోతాయని అంటున్నారు. మరో వైపు విత్తనాలను పురుగులు తినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తపరుస్తున్నారు.


విత్తనాలు నాటుతున్న రైతులు (ఫైల్)

● నీటి తడులు పెడదామంటే

సాగునీటి వసతి ఉన్న కొంత మంది రైతులు విత్తనం నాటి వర్షం కోసం ఎదురు చూడకుండా సాగునీటి తడులు పెడదామనుకుంటే భూగర్భ జలాలు పెరగకపోవడంతో నీటి తడులు పెట్టలేకపోతున్నారు. అంతేగాక విద్యుత్ కోతలతో పాటు ఇటీవల కురిసిన వర్షాలు ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాలు తరచుగా అంతరాయం కలుగుతుందని రైతులు అంటున్నారు. ఖరీఫ్ పంట సాగు చేసే రైతులకు ఆదిలోనే కష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు.

● చేతిలో చిల్లి గవ్వ లేదు



ప్రభుత్వ పరంగా ప్రతి ఏడాది వచ్చే రైతు భరోసా ఈసారి ఇంకా రాక పోగా జొన్న పంట అమ్మిన రైతులకు డబ్బులు రాకపోవడంతో రైతులు చేతిలో చిల్లిగవ్వలేక ఇబ్బందులకు గురవు తున్నారని రైతు రమేష్ రెడ్డి వాపోయారు. వ్యవసాయం అనేది జూదంగా మారిందని గత్యంతరం లేక వ్యవసా యం చేస్తే అప్పులే మిగులుతు న్నాయని రైతులు వాపోతున్నారు. ఏది ఏమైనా విత్తనాలు వేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సబ్సిడీపైన విత్తనాలను అందించాల్సిన అవసరం ఏర్పడుతుంది.

- రమేష్‌రెడ్డి, రైతు

ఫటా..ఫట్...

జూన్ నెలలో ఈ పంటలు వేసుకోండి

• రాంచందర్ నాయక్, మండల వ్యవసాయ అధికారి, నర్సాపూర్ (జి)



ఆంధ్రజ్యోతి: జూన్ నెలలో ఏ పంటలు వేయడం ఉత్తమం...?

అధికారి: జూన్ నెలలో మొక్క జొన్న, పత్తి, కంది, పెసర, మినుము వంటి పంటలను విత్తుకోవడం అనుకూలం. ఈ పంటలు ఈ ప్రాంత వాతావరణానికి, నేల స్వ భావానికి సరిపోతాయి. వీటితో పాటు వర్షాధారిత కూరగాయలు కూడా వేసుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి: విత్తనాలు వేసే ముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి...?

అధికారి: విత్తనాలు విత్తే ముందు భూమిని సిద్ధం చేసి, విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి. నాణ్యమైన విత్తనాలను ఎంచుకొని, నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు మాత్రమే విత్తాలి. భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వాడాలి.

ఆంధ్రజ్యోతి: పత్తి విత్తనాలు వేసేటప్పుడు ఎలాంటి ప్రత్యేక సూచనలు పాటిస్తే మంచిది...?

అధికారి: బీటీ పత్తి విత్తనాలను ప్రభుత్వం అనుమతి పొందినవి మాత్రమే ఎంచుకోవాలి. మొక్కల మధ్య సరైన దూరం పాటించి, మొలకలు వచ్చాక బలహీనమైన వాటిని తీసి వేయాలి. సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి.

ఆంధ్రజ్యోతి: రుతుపవనాల జాప్యం లేదా అధిక వర్షాలు వస్తే ప్రత్యామ్నాయ ప్రణాళిక ఏమైనా ఉందా..?

అధికారి: వర్షాలు ఆలస్యమైతే తక్కువ కాలంలో పక్వానికి వచ్చే పెసర, మినుము వంటివి వేసుకోవచ్చు. అధిక వర్షాలు వస్తే పొలాల్లో నీటి పారుదల కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. వాతావరణానికి తట్టుకునే కొత్త రకాలను ఎంచుకోవాలి.

● (నర్సాపూర్(జి), ఆంధ్రజ్యోతి)

అంతా బురదమయం


తాంసి జిల్లా పరిషత్ ప్రాంగణంలో బురదమయంగా ఉన్న దృశ్యం

తాంసి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ పాఠశాల ఆవరణలు మాత్రం అపరిశుభ్రంగానే దర్శనమిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు అంటి ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్ర వ్యక్తం అవుతున్నాయి. దీంతో చినుకు పడితే చాలు పాఠశాల ప్రాంగణ మంతా బురదయంగా మారుతుంది. అయినా సంబంధిత శాఖ అధికారులు తమ కేమీ అన్నట్లుగా వ్యవహరిస్తున్న వ్యక్తమవుతున్నాయి. సాక్షాత్తు తాంసి మండల కేంద్రంలోని జిల్లా పరి షత్ పాఠశాల ప్రాం గణమే దీనికి నిదర్శమని చెప్పవచ్చు. నిత్యం వివిధ శాఖ అధికారులు కొలువుండే మండల కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల్లో పరిస్థితులు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవా లని పలువురు అంటున్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ విద్యాభివృద్ధి కోసం పలు చర్యలు తీసుకుంటున్నప్పటికీ మండలంలో మాత్రం అవి ఎందుకు అమలు కావడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

'ఆంధ్రజ్యోతి' పరిశీలన


న్యూ లోలం గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న మినీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


న్యూ లోలం వ్యవసాయ భూముల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


దిలావర్‌పూర్ తండాలో మినీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్..


దిలావర్‌పూర్ తండా వ్యవసాయ భూముల్లో..

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లతో పొంచి ఉన్న ప్రమాదం

● ఆదమరిస్తే షాకే ● వర్షాకాలం వచ్చిందంటే దిలావర్‌పూర్ జనంలో వణుకు

దిలావర్‌పూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ నిర్వహణ తీరు అస్తవ్యస్తంగా ఉంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ మరీ దారుణంగా ఉంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు ప్రజలు తీవ్ర భయాందోళనకు లోనవుతున్నారు. మండలంలోని గ్రామాల్లో ఉన్న వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, గృహ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్నిచోట్ల విద్యుత్ తీగలు అందే ఎత్తులో ఉండగా మరికొన్ని చోట్ల కిందికి వేలాడుతూ విద్యుత్ శాఖ అధి కారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. ప్రతీ ఏటా విద్యుత్ లైన్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తు న్నప్పటికీ అవి ఎక్కడ ఖర్చు చేస్తున్నారో దేవుడి కెరుక... సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.


ట్రాన్స్‌ఫార్మర్లతో పొంచి ఉన్న ప్రమాదం..

మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ఏ మాత్రం ఆదమరచినా ప్రాణాలు గాల్లో కలువడం ఖాయం. ఇప్పటికే ఎంతో మంది రైతులు, పశువులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. ప్రధానంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రహదారులను ఆనుకుని ఉన్నాయి. గ్రామాల్లో, గ్రామ సమీపంలలోనో ఉన్నాయి. అయితే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె నిర్మించాల్సి ఉన్నప్పటికీ ఎందుకో ఆశాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు ఆన్ ఆఫ్ సౌకర్యం లేక నేరుగా విద్యుత్ సరఫరా జరుగుతుండగా, మరి కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు ఆ సిస్టమ్ తుప్పు పట్టి పనిచేయడం లేదు.

పిచ్చి మొక్కల మధ్య ట్రాన్స్‌ఫార్మర్లు..

కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు పిచ్చి మొక్కల మధ్య ఉండటంతో పశువులు మేత కోసం వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చి మొక్కలు తొలగించడంలోను అధికారులు అశ్రద్ధ చేస్తున్నారు. ఎక్కువ శాతం ట్రాన్స్ ఫార్మర్లు ప్రధాన రోడ్లకు ఆనుకొని ఉండటం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచు కొచ్చి ఎవరు బలి అవుతారోనన్న భయం అటు రైతుల్లోను, ఇటు ప్రయాణికుల్లో కనబడుతోంది. అధికారులు ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె నిర్మాణాలు చేసి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.


సాంగ్వి రోడ్డును ఆనుకొని..


దిలావర్‌పూర్ - బన్సపల్లి రోడ్డు పక్కన


బన్సపల్లి సమీపంలో పిచ్చి మొక్కల మధ్య


వడ్డేపల్లి ప్రభుత్వ పాఠశాల పక్కన


వడ్డేపల్లి రోడ్డు పక్కన

'ఆంధ్రజ్యోతి' ఫోకస్


గుంతలమయమైన మల్లాపూర్ - మునిపెల్లి గ్రామాల మధ్యగల తారు రోడ్డు


నీటి కుంటలతో కూడిన మల్లాపూర్ - ధర్మారం మధ్య గల తారు రోడ్డు

రోడ్డంతా గుంతలు.. ప్రయాణానికి అడ్డంకులు

● ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోని ధర్మారం టు చామన్‌పెల్లి తారు రోడ్డు ● అత్యవసర వైద్య సేవలకు వెళ్తే ప్రాణాలతో చేరుతారన్న గ్యారంటీ లేదు

లక్ష్మణచాంద, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మారం నుంచి మల్లాపూర్, మునిపెల్లి గ్రామాల మీదుగా చామన్‌పెల్లి ఎక్స్ రోడ్ వరకు గల తారు రోడ్డు వెంట అత్యవసర వైద్య సేవలకు వెళ్తే ప్రాణాలతో చేరు తారన్న గ్యారంటీ లేదు. ఈ రోడ్డు పూర్తిగా గుంతల మయమై ప్రయా ణికులకు అడ్డంకిగా మారింది. ఈ రోడ్డు వెంట ఆయా గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రమైన నిర్మల్‌కు మండల కేంద్రమైన లక్ష్మణచాందకు ప్రతిరోజు రాకపోకలు కొనసాగిస్తారు. ఆర్టీసీ బస్సుతో పాటు వ్యవసాయ పంటలను తరలించే లారీలు, స్కూల్ బస్సులు, ఇతర భారీ వాహనాలు కూడా ఈ రోడ్డు వెంట అనునిత్యం ప్రయాణిస్తాయి. రోడ్డుపై ఏర్పడిన గుంతల కార ణంగా సాధారణ ప్రయాణికులతో పాటు వైద్య చికిత్సల కోసం వెళ్లే రోగు లను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. సడన్‌గా గుండె జబ్బు వచ్చి అంబు లెన్స్‌లో తరలిద్దామంటే ప్రాణాలతో ఆసుపత్రికి చేరుతారని గాని, తిరిగి వస్తారన్న గ్యారంటీ గాని లేకుండా పోయింది. ఈ తారు రోడ్డుకు సాధారణంగా ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి మరమ్మతులు చేపట్టాలి. కానీ దాదాపు 15 సంవత్సరాలు దాటి పోతున్నా ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టడం లేదంటే రోడ్లపై ప్రభుత్వం కనబరుస్తున్న అశ్రద్ధకు నిదర్శనమని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజాప్రతినిధులు సహకరించి వెంటనే మరమ్మతులుచేపట్టాలని కోరుతున్నారు.

మంజూరైన వెంటనే మరమ్మతులు ప్రారంభిస్తాం..
- సంజయ్, ఆర్అండ్‌బీ ఏఈ, లక్ష్మణచాంద

ధర్మారం టు చామన్‌పెల్లి రోడ్డు పూర్తిగా గుంతలమయమై పాడైన విషయం వాస్తవమే. దాదాపు 8 కిలో మీటర్ల పొడవు గల ఈ రోడ్డు మరమ్మతులు కోసం 2.4 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపడం జరిగింది. మంజూరు అయిన వెంటనే మరమ్మతులు ప్రారంభిస్తాం.

రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి..
- దేవరాల భీమేష్ (యువ నాయకులు, మల్లాపూర్)



తారు రోడ్డంతా పూర్తిగా పాడైపోయింది. అత్యవసర పని మీద జిల్లా కేంద్రానికి గానీ మండల కేంద్రానికి గానీ తరలి వెళ్లాలంటే సమయానికి చేరుకునే పరిస్థితి లేదు. ద్విచక్ర వాహనాలపై వెళ్తే చాలాసార్లు ప్రమాదాలు జరిగి పలువురు గాయాలపాలయ్యారు. మా గ్రామానికి అధికారులు రావాలన్నా ఇబ్బందులకు గురవుతున్నారు. కాబట్టి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

చాలాసార్లు విన్నవించాం అయినా నిధులు మంజూరు చేయలేదు.
అడిచెర్ల రవి కుమార్ (మాజీ సర్పంచ్, మల్లాపూర్)



ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని చాలాసార్లు అధికారులకు విన్న వించాం. జనరల్ బాడీ సమావేశాల్లో నిలదీశాం. అయినా గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మరమ్మతుల కోసం కేటాయించలేదు. ఈ ప్రభుత్వ మైనా స్పందించి నిధులు కేటాయించి మరమ్మతులు పూర్తి చేయాలి.

కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి రథ సేవల నిలుపుదల


అశ్వరథంపై కాల్వ లక్ష్మీ నరసింహ స్వామివారి ఉత్సవ మూర్తులు

దిలావర్‌పూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం నేపథ్యంలో కాల్వ లక్ష్మీ నరసింహ స్వామివారి రథ సేవలను నిలిపి వేస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ అంగూర్ మహేందర్, ఈవో భూమయ్య శనివారం తెలిపారు. కాల్వ గ్రామం నుంచి ప్రతీ శనివారం స్వామివారి ఉత్సవ విగ్రహాలను బాజాభజంత్రీలతో రథంపై తీసుకువచ్చి ప్రధాన ఆలయం, స్వామివారి పుష్కరిణి వద్ద సేవలను నిర్వహించడం రథ సేవలో భాగమని, అయితే వర్షాకాలం కావడంతో రథ సేవలకు అంతరాయం ఏర్పడుతుందన్న కారణంతో వర్షాకాలం ముగిసే వరకు రథ సేవలు నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. మిగతా పూ జా కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. భక్తులు సహకరించాలని పాలక మండలి సభ్యులు, ఆలయ అధికారులు కోరారు.

ఆహ్లాదం.. అధ్వానం


కైలాస్‌నగర్‌లోని మినీ పార్కు

● పడిపోయిన పరికరాలు

పచ్చిక బయళ్లతో ఆహ్లాదం, ఆనందం పంచాల్సిన పార్కు అధ్వానంగా మారింది. నిర్వహణ లేక.. పర్యవేక్షణ కరువై అపరిశుభ్రంగా మారింది. రూ. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు కింద పడిపోయి పనికిరాకుండా పోయాయి. ఇది ఎక్కడో మారుమూల పల్లెల్లో అనుకుంటే మీరు పొరబడినట్లే సుమా.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నడిబొడ్డున కైలాష్ నగర్‌లోని మినీ పార్కులో కనిపించిన దుస్థితి ఇది..

● ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఫొటో న్యూస్


కైలాస్‌నగర్ పార్కులో విరిగిపోయిన వ్యాయామ పరికరాలు


అంగరంగ వైభవంగా భీమన్న ఆలయ వార్షికోత్సవం

నిర్మల్ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కురన్నపేట్ కాలనీలో గల భీమన్న ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా ఉదయం నుంచి వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేకపూజలు జరుపగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రాజేశ్వర్, ధర్మరాజు, గోవర్ధన్, రమేష్, చంద్రశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టుకు మరమ్మతులు


కడెం ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కడెం ప్రాజెక్టు ఇదే


వరద గేట్ల లోపలి సొరంగంలో శుభ్రం చేస్తున్న సిబ్బంది

- ప్రాజెక్టుకు ఊపిరి పోసిన రాష్ట్ర ప్రభుత్వ చర్యలు
- రెయిన్ గేజింగ్ స్టేషన్ సిద్ధం
- వరద అంచనాకు పకడ్బందీ సన్నాహాలు
- 14 లోతట్టు ప్రాంతాలకు సైరన్ సిస్టం
- ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలూ సిద్ధం

నిర్మల్,జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతీయేడు వర్షాకాలంలో ప్రమాదపు అంచులోకి చేరుకునే జిల్లాలోని కడెం ప్రాజెక్టును రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఊపిరి పోస్తున్నాయి. గత మూడేళ్లుగా ఈ ప్రాజెక్టులోకి లక్షలాది క్యూసెక్కుల వరద వస్తుండడంతో.. మరమ్మతులు లేక గేట్లు ఎత్తలేని పరిస్థితి తలెత్తింది. ఫలితంగా పలుమార్లు ప్రాజెక్టుపై నుంచి కూడా నీరు ప్రవహించింది. అలాగే వరద ఉధృతికి గేట్లు, కౌంటర్ వెయిట్‌లు సైతం కొట్టుకుపోయిన దుస్థితి. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు 10 ఏళ్లుగా ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు విడుదల చేయని కారణంగానే ఈ సమస్య ఏటేటా తీవ్రమైంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో ప్రాజెక్టు మరమ్మతు పనులకు రాష్ట్ర ప్రభుత్వం 10 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. అలాగే గడువులోగా పనులు పూర్తి కావాలంటూ అధికారులకు టార్గెట్ కూడా విధించింది. దీంతో ప్రాజెక్టు అధికారులు రాత్రింబవళ్లు శ్రమించి రికార్డు టైంలో ఈ ప్రాజెక్టుకు మరమ్మతులను పూర్తి చేశారు. ప్రాజెక్టు మరమ్మతులు పూర్తి కావడంతో.. గత వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరద నీటిని అధికారులు ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ దానికి అనుగుణంగా గేట్లు పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో లోతట్టు ప్రాంతాలకు, పంట పొలాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు.


జనరేటర్ శుభ్రం చేస్తున్న సిబ్బంది

సుమారు 68 వేల ఎకరాల ఆయకట్టు పంట భూములతో పాటు 14 లోతట్టు గ్రామాలు వరద ముంపు నుంచి బయటపడ్డాయి.

రెయిన్ ఫాల్ గేజ్ స్టేషన్‌ల ఏర్పాటు

ప్రతి ఏటా కడెం ప్రాజెక్టుకు ముప్పుగా మారుతున్న వరద ఉధృతిని తెలుసుకునే అవకాశం లేకపోవడంతో.. ఇటు ప్రాజెక్టును, అటు లోతట్టు గ్రామాలను వరద ముంచెత్తుతుండడం సహజంగా మారింది. ఎగువ నుంచి వచ్చే వరద ప్రవాహాన్ని శాస్త్రీయంగా అంచనా వేసే అవకాశం లేకపోవడం కూడా ప్రాజెక్టుకు సమస్యగా మారింది. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వరద ఉధృతిని లెక్క కట్టేందుకు శాస్త్రీయ, సాంకేతిక పరమైన చర్యలను తీసుకుంది. ఎగువ నుంచి వచ్చే వరదను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు సంబంధిత అధికారులు నాలుగు చోట్ల రెయిన్ ఫాల్ గేజ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. అవసరమైన చోట్ల సెన్సార్లను కూడా ఏర్పాటు చేశారు. వీటి ఆధారంగా ఎగువ నుంచి వచ్చే వరదను ఎప్పటికప్పుడు లెక్క కట్టే అవకాశం ఏర్పడింది. వరద ఉధృతిని పక్కాగా లెక్కగట్టి దానికి అనుగుణంగా గేట్లను పైకెత్తుతూ అధికారులు దిగువకు నీటిని విడుదల చేయనున్నారు. మొన్నటి వరకు ఈ స్టేషన్‌లు లేని కారణంగానే అధికారులు వరద ఉధృతిని సరిగ్గా అంచనా వేయలేకపోయారు. ప్రస్తుతం మందపల్లి వద్ద గల పలికేరు వాగు వద్ద, కడెం నది తాటిగూడ వద్ద, చిక్‌మాన్ వాగు వద్ద, అలాగే కుప్టి వాగు వద్ద ఈ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఈ నాలుగు ప్రాంతాల నుంచే కడెం ప్రాజెక్టులోకి పెద్ద మొత్తంలో వరద నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అధికారులు గేజింగ్ స్టేషన్లకు సెన్సార్లను అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు వరద ఉధృతిని తెలుసుకుంటూ ఆ ఉధృతికి అనుగుణంగా ప్రాజెక్టు గేట్లను పైకెత్తి దిగువకు నీటిని వదలనున్నారు. ఇప్పటి మాదిరే గత వర్షాకాలంలో కూడా ప్రాజెక్టు అధికారులు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకుని ప్రాజెక్టు గేట్లు పైకి ఎత్తే అంశంపైనే దృష్టి సారించారు. గత సంవత్సరం ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి దాదాపు రెండున్నర లక్షల క్యూసెక్కులకు పైగా ఇన్ ఫ్లో కొనసాగింది. అయితే అధికారులు ఏర్పాటు చేసిన రెయిన్ గేజ్ స్టేషన్‌లు, సెన్సార్ల ద్వారా వరదను తెలుసుకుంటూ దిగువకు 2 లక్షల 78 వేల క్యూసెక్కులకు పైగా నీటిని వదిలారు. దాదాపు ఐదు గంటలకు పైగా ఎగువ నుంచి వరద ఇదే ఉధృతితో కొనసాగినప్పటికీ.. రెయిన్ గేజింగ్ స్టేషన్లు, సెన్సార్ల ద్వారా అధికారులంతా సమన్వయంగా వ్యవహరించి సక్సెస్ ఫుల్‌గా దిగువకు నీటిని వదిలారు. ఈసారి కూడా ఇదే యాక్షన్ ప్లాన్‌ను అధికారులు మరింత పకడ్బందీగా అమలు చేయనున్నారు.

14 గ్రామాలకు సైరన్ హెచ్చరిక

కడెం ప్రాజెక్టు దిగువన ఉన్న 14 లోతట్టు గ్రామాలకు ప్రతిఏటా వర్షాకాలంలో వరద ముప్పు ఏర్పడుతోంది. ఎగువ నుంచి వరద ఉధృతి పెరగడంతో అధికారులు ఎప్పటికప్పుడు ప్రాజెక్టు గేట్లు పైకెత్తి ఆ వరద నీటిని దిగువకు విడుదల చేస్తుంటారు. దీని కారణంగా లోతట్టు ప్రాంతాలకు ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహ సమాచారాన్ని తెలపడం అధికారులకు కత్తి మీద సాములా మారింది. ఈ నేపథ్యంలో అధికారులు 14 లోతట్టు గ్రామాల్లో వరద హెచ్చరికలకు సంబంధించిన అలారంలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే అలారంల ఏర్పాటుకు సంబంధించి నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సమీక్ష సమావేశం నిర్వహించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసే సమయాని కంటే ముందుగానే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా అలారంలను గ్రామాల్లో మోగించనున్నారు. దీంతో అలారం మోగగానే గోదావరి నది వైపు పశువుల కాపరులు, సాధా రణ ప్రజలు వెళ్లకూడదంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేయ నున్నారు. అలారం మోత కారణంగా వరద విపత్తుల గురించి ప్రజలకు ముందస్తుగానే సమాచారం అందుతుంది. దీంతో వరద ప్రమాదాలు తగ్గే అవకాశం ఏర్పడనుందని అధికారులు చెబుతున్నారు.


కడెం ప్రాజెక్టు వరద గేట్లకు గ్రీసింగ్ చేస్తున్న దృశ్యం

ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం

ఎస్‌డీఆర్ఎఫ్ కింద ఇప్పటికే జిల్లాలో 70 మంది పోలీసులకు జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో వరద విపత్తులను ఎదుర్కోవడంపై శిక్షణ ఇచ్చారు. అలాగే మరో 150 మంది పోలీసులకు కూడా వరద విపత్తులపై శిక్షణను మొదలుపెట్టనున్నారు. అయితే ఈ ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు కడెం ప్రాజెక్టు వరదలపైనే కాకుండా స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టులు, భారీ చెరువుల వరదల సమయంలో కూడా రక్షణ చర్యలను చేపట్టనున్నారు. మరోవైపు.. వరద విపత్తును ఎదుర్కొనేందుకు ఎయిర్ బోర్ట్, లైవ్ జాకెట్స్, ట్యూబ్స్, రూప్స్ లాంటి పరికరాలన్నింటినీ పోలీసుశాఖ ఇప్పటికే సిద్ధం చేసింది. అలాగే పోలీసుస్టేషన్లతో పాటు రెవెన్యూ ఆఫీసులలో హెల్ప్ డెస్క్‌ను, టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే ఇటీవల ఏర్పాటు చేసిన శివంగి టీంలను కూడా అవసరమైతే రంగంలోకి దించేందుకు పోలీస్ శాఖ సిద్ధమవుతోంది.

రూ. 49 లక్షలతో తాజా ప్రతిపాదనలు

కడెం ప్రాజెక్టు కాలువల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం, చెట్లను తొలగించేందుకు అధికారులు 49 లక్షల రూపాయలతో ప్రతిపాదనలు రూపొందించారు. ఇప్పటికే అధికారులు ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే వెంటనే కాలు వలలో పేరుకుపోయిన పిచ్చ మొక్కలను, చెట్లను, చెత్తా చెదారాన్ని యుద్ధ ప్రాతిపదికన తొలగించేందుకు అధి కారులు సన్నాహాలు చేస్తున్నారు.

అడెల్లు అలియాస్ భాస్కర్

కుటుంబాన్ని ఆదుకోవాలి

57 కులాల రాష్ట్ర ఉపాధ్యక్షుడి డిమాండ్


అడెల్లు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

నిర్మల్ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర మావోయిస్టుల రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ కుటుంబాన్ని ఆదుకోవాలని 57 ఉప కులాల ఉపాధ్యక్షులు గంధం గంగాధర్ అన్నారు. శనివారం ఎమ్మార్పీఎస్, బుడగ జంగం నాయకులు బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామంలో వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి పరామర్శించారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు. ఎన్కౌంటర్‌లో మృతి చెందిన అడెల్లు అలియాస్ భాస్కర్ కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం దుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కే. రాజు, ఎన్. లక్ష్మణ్, సారంగాపూర్ మండల ఇన్‌చార్జి శ్రీనివాస్, దిలావర్‌పూర్ ఇన్‌చార్జి బాపనన్న తెలంగాణ దుందాం కళాకారుడు దరువు భోజన్న పాల్గొన్నారు.

శుభ్రతకు నోచుకోని మినీ ట్యాంకులు


గణేష్‌నగర్‌లో శుభ్రతకు నోచుకోని మినీ నీటిట్యాంకు

భైంసా, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలో నీటి పథకాల నిర్వాహణ వ్యవస్థ అస్తవ్యస్థంగా కొనసాగుతోంది. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా తీసుకుంటున్న నిర్వహణ సిబ్బంది విధుల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం మూలంగా సమస్యలు పెరుగుతున్నాయి. ప్రధానంగా మినీట్యాంకుల నిర్వహణ వ్యవస్థ లోపభూయిష్టంగా కొనసాగుతోంది. నెలల తరబడి మినీ ట్యాంకులు శుభ్రతకు నోచుకోవడం లేదు. క్లోరినేషన్ మచ్చుకైనా కానరావడం లేదు. ఈ కారణంగా మినీ ట్యాంకులు అపరిశుభ్రతకు నిలయంగా మారుతున్నాయి. ట్యాంకుల చుట్టూ పాచు పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. ట్యాంకులకు అనుగుణంగా మురికికాల్వల నిర్మాణం చేపట్టక పోవడం మూలంగా మురికి నీరంతా ట్యాంకుల సమీపంలోనే నిలిచిపోతున్నాయి. ట్యాంకులకు పైకప్పు లేకపోవడం మూలంగా గాలి వీచినప్పుడు వాటిలో దుమ్ము, ధూళి, వ్యర్థ పదార్థాలు చేరి పెరుకుపోతున్నాయి. ఇలాంటి ట్యాంకులలోని నీటిని వినియోగిస్తున్నవారు అనారోగ్యం బారిన పడుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. మున్సిపల్ అధికార యంత్రాంగం ఇక నైనా స్పందించి మినీ ట్యాంకుల నిర్వహణ వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జాతీయ లోక్ అదాలత్ ద్వారా కోర్టు కేసులను పరిష్కరించుకోవాలి

కలెక్టర అభిలాష అభినవ్


లోక్ అదాలత్ ద్వారా తమ విడాకుల కేసును పరిష్కరించుకున్న భార్యాభర్తలను అభినందిస్తున్న కలెక్టర్, న్యాయాధికారి

నిర్మల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్ సేవలను వినియోగించుకుని ప్రజలు తమ కోర్టు కేసులను త్వరగా పరిష్కరించుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. శనివారం పట్టణంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్ ప్రారంభ కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి ఎన్.శ్రీవాణితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కేసులు సంవత్సరాలుగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉండటం వల్ల ప్రజలు మానసికంగా, ఆర్థికంగా నష్టపోతున్నారని, లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలు రాజీకి వచ్చి త్వరితంగా న్యాయం పొందవచ్చని తెలిపారు. కోర్టు చుట్టూ తిరిగే అవసరం లేకుండా ప్రశాంతంగా జీవించవచ్చన్నారు. ఇటీవల జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాల్య వివాహాలు, మాదక ద్రవ్యాలు, నైతిక విలువలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సమాచార శాఖ కళాజాత బృందాల ద్వారా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ... పలు క్రిమినల్, సివిల్, కుటుంబ తగాదాలు, భూ వివాదాలు, ఆస్తి గొడవలు వంటి కేసులను లోక్ అదాలత్ ద్వారా రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. న్యాయవాదులు ప్రజలను లోక్ అదాలత్‌కు ప్రోత్సహించాలన్నారు. అనంతరం లోక్ అదాలత్ ద్వారా తమ విడాకుల కేసును పరిష్కరించుకున్న భార్యాభర్తలను కలెక్టర్, న్యాయమూర్తిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాస్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ రాధిక, అడిషనల్ ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నరేందర్, కోర్టు అధికారులు, న్యాయవాదులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ముథోల్ నియోజకవర్గంలో

ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయండి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించిన మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గం పరిధిలోని పలు సమస్యలతో పాటు అవసరమైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రికి వివరించారు. ప్రధానంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు అనువైన స్థలం ఉన్న దృష్ట్యా మంజూరి ఇవ్వాలని కోరారు. లోకేశ్వరం మండలం అర్లి (బి) వంతెన శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలిపోతోందన్న ప్రమాదకర పరిస్థితులు నెలకొని ఉన్న దృష్ట్యా కొత్త వంతెన నిర్మాణాన్ని సత్వరమే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలకు అనుగుణంగా వంతెన నిర్మాణాన్ని మంజూరు చేయాలన్నారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి క్షేత్రానికి మంజూరైన రూ. 42 కోట్ల మాస్టర్ ప్లాన్ పనులకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. రెండు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాల మూలంగా దెబ్బతిన్న చెరువులకు మరమ్మత్తులు నిర్వహింప చేసి సాగునీటి వ్యవస్థ మెరుగుదలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ముథోల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సానుకూలంగా స్పందించినట్లుగా మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చెప్పారు.

ప్రధాని మోదీ సంస్కరణలతో అగ్రగామిగా భారత్

భైంసాలో వికసిత్ భారత్ సంకల్ప సభలో బీజేపీ వక్తలు


సమావేశంలో పాల్గొన్న బీజేపీ ప్రతినిధులు

భైంసా, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న సంస్కరణలు,తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలతో ప్రపంచంలో భారత్ అగ్రగామిగా ఎదుగుతోందని బీజేపీ భైంసా మండల అధ్యక్షులు సిరం సుష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి సట్ల సాయినాథ్, మాజీ ప్రధాన కార్యదర్శి అశోక్ భండారి, బీజేవైఎం ప్రతినిధి గంగా ప్రసాద్‌లు పేర్కొన్నారు. శనివారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో వికసిత్ భారత్ సంకల్ప సభ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. పార్టీ శ్రేణులన్నీ ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా క్షేత్ర స్థాయిలో గ్రామగ్రామాన విస్తృత పర్యటలను చేపట్టాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి ప్రధాని మోదీ సారథ్యంలో జరిగిన సంస్కరణలు, సాధించిన విజయాల, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, పరిష్కరించిన సమస్యలను వివరించాలన్నారు. ఇదే క్రమంలో రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులన్నీ సన్నద్ధం కావాలన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యోన్ముఖులు కావాలని అకాంక్షించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని పూర్తి స్థాయిలో బలోపేతం చేసేందుకు గాను పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. ఇందులో పార్టీ ప్రతినిధులు ,వివిధ మోర్చాల బాధ్యులు ఆకాష్, మహేందర్, సత్యనారాయణ రెడ్డి, రాజేశ్వర్, సుధాకర్, మల్లేష్‌పాతర్ల నరేష్‌తో పాటు ఆయా ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మల్లన్న గుట్ట క్షేత్రంలో

సంకటహర చతుర్థి హోమం


పూరాహుతిలో పాల్గొన్న భక్తులు

నిర్మల్ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మల్లన్న గుట్ట క్షేత్రంలో సంకటహర చతుర్థి పురస్కరించుకొని హోమం నిర్వహించినట్లు వేద పండితులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీమాసంలోను సంకటహర చతుర్థి నాడు యథాశక్తి విఘ్నేశ్వరుడికి పూజలు జరిపితే కష్టాలు తొలగి సుఖసంతోషాలతో పాటు విజయం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

దిలావర్‌పూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన రైతులు రైతు భరోసా, పెట్టుబడి సహాయానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 జూన్ 5వ తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు భూమి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలను జతచేసి ఈ నెల 20వ తేదీలోపు వ్యవసాయ కార్యాలయంలో లేదంటే క్లస్టర్ ఏఈఓలకు అందజేయాలని ఎంఏవో కోరారు. ఇప్పటికే రైతు భరోసా సహాయం పొందుతున్న రైతులు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు.

బాసర జోన్ అటవీశాఖ

నిఘా విభాగ అధికారిగా టి.రమేష్‌కుమార్


టి.రమేష్‌కుమార్

నిర్మల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : బాసర జోన్ పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల అటవీశాఖ నిఘా విభాగం అధికారిగా టి. రమేష్ కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో వన్యప్రాణి విభాగంలో పనిచేస్తున్న రమేష్‌కుమార్ పదోన్నతిపై నిర్మల్‌కు బదిలీ చేశారు. అటవీశాఖ నిర్మల్‌లో ఉద్యోగ జీవితం ఆరంభించిన రమేష్ కుమార్ నిర్మల్ ప్రాంతంలో వివిధ హోదాల్లో వివిధ ప్రాంతాల్లో పని చేశారు. రమేష్‌కుమార్ ఇక్కడి ప్రాంత ప్రజలకు సుపరిచితుడు కావడం విశేషం. ఆయన సోమవారం రోజు పదవీ బాధ్యతలు స్వీకరిస్తారని అటవీశాఖ వర్గాలు తెలిపాయి.

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదానం

నిర్మల్ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం ఏక్తా కమ్యూనిటీ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా సొసైటీ సభ్యులు, మెడికల్ కాలేజీ విద్యార్థులు, ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేసినట్లు అధ్యక్షులు షేక్ ముజాహిద్ సాజిద్ తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువకులకు అభినయ, ఆర్ఎంవో, డాక్టర్ సమత చేతుల మీదుగా విశిష్ట పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ స్థాపికులు అధ్యక్షులు షేక్ ముజాహిద్, ఉపాధ్యక్షులు అబ్దుల్ సాజిద్, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఫాజిల్ హష్మీ, ముస్తఫా, షైబాజ్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది మన్సూర్, రాకేష్, తదితర సభ్యులు పాల్గొన్నారు.